క్లుప్తంగా

ప్రణాళిక రూపొందించాలి



గ్రామసభలో చర్చిస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని దనోరా (బి) గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. 2025– 26 పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై చర్చించారు. గ్రామాల్లో చేపట్టాల్సిన రోడ్లు, డ్రెయినేజీ, పారిశుధ్యం, శానిటేషన్ పనులపై ప్రణాళికలు రూపొందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో జీవన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



పూజలో పాల్గొన్న ఎంపీ గోడం నగేశ్

బజార్‌హత్నూర్: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసం ఉంటుందని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. శనివారం మండలంలోని పిప్రి గ్రామంలో అయ్యప్పస్వామి పడిపూజలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు తాటిపల్లి రాజు, శ్రీనివాస్‌రెడ్డి, తులసిరాం, కరుణకర్‌రెడ్డి, లింగారెడ్డి, లక్ష్మారెడ్డి, పందుగ మురళీమోహన్, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థినులకు కంటి పరీక్షలు



కంటి అద్దాలు అందజేసిన వైద్య సిబ్బంది

నేరడిగొండ: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థినులకు కంటిచూపు పరీక్షలు నిర్వహించారు. దృష్టి లోపం ఉన్న విద్యార్థినులకు సంస్థ ద్వారా ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేరడిగొండ వైద్యాధికారి ఎండీ సద్దాం, మండల ఆప్తాల్మిక్ ఆఫీసర్ భాస్కర్ రావ్, ఫార్మాసిస్టు శ్రీనివాస్, కేజీబీవీ ఇన్‌చార్జి సంధ్యరాణి పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

నేరడిగొండ: మండలంలోని తేజాపూర్ గ్రామ అయ్యప్ప స్వాములు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌లను వేర్వేరుగా కలిశారు. శనివారం మండల కేంద్రంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. తేజాపూర్ గ్రామంలో అయ్యప్ప సన్నిదానానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. నిధులు మంజూరు చేసేలా తమవంతుగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

అనుభవాన్ని పరిగణనలోకి తీసుకోవాలి

ఇచ్చోడ: ప్రభుత్వం వీఆర్వో వ్యవస్థను తిరిగి పునరుద్ధరించడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే వీఆర్వోల అనుభవాన్ని పరిగణనలోకి తీసుకోవాలని పూర్వ వీఆర్వోల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సయ్య కోరారు. శనివారం మండలంలో కేంద్రంలో మట్లాడారు. గత ప్రభుత్వం 121 జీవో ద్వారా వీఆర్వోల వ్యవస్థను పూర్తిగా రద్దు చేసిందన్నారు. దీంతో వివిధ శాఖల్లో జాయిన్ కావడంతో వీఆర్వోలు 15 ఏళ్ల సర్వీసును కోల్పోయినట్లు తెలిపారు. కొత్తచట్టం ద్వారా సర్వీసు కోల్పోకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

పత్తి కొనుగోళ్లు బంద్

బేల: మండల కేంద్రంలోని ఆశాపూర జిన్నింగ్‌లో పత్తి నిల్వలు పేరుకుపోయినందున వచ్చే నెల 1వరకు సీసీఐ పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు జైనథ్ మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ రాజ్‌కిరణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి పత్తి కొనుగోళ్లను 2వ తేది నుంచి పునఃప్రారంభిస్తామన్నారు. రూ.50 తగ్గింపుతో పత్తి క్వింటాలుకు ధర రూ.7,471 కొనుగోళ్లు ఉంటాయన్నారు. రైతులు గమనించి సహకరించాలని తెలిపారు.

జయప్రదం చేయండి

ఎదులాపురం: సీపీఐ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ఈనెల 30న నల్గొండలో నిర్వహించనున్న మహాసభను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. పార్టీ ఆవిర్భవించినప్పటి నుంచి అన్నివర్గాల హక్కుల సాధనే ధ్యేయంగా ఉద్యమించిందన్నారు. సమావేశంలో నాయకులు అరుణ్ కుమార్, షేక్ పాషా, రమేష్, గణేష్, స్వామి పాల్గొన్నారు.

అసంపూర్తిగా మరుగుదొడ్ల నిర్మాణం



నిలిచి పోయిన మరుగుదొడ్ల నిర్మాణ పనులు

తాంసి: మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలలో నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్ల పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఆశ్రమ పాఠశాలలో గత ఏడాది క్రితం మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా.. పనులను చేపట్టడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ మధ్యలోనే నిలిపివేయడంతో 117 మంది విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. మరుగుదొడ్లు, స్నానపు గదుల నిర్మాణం పూర్తికాక ప్రస్తుతం శిథిలావస్థకు చేరిన వాటిని వినియోగించాల్సిన పరిస్థితి ఉంది. ఇప్పటికైనా అధికారులు పనులు పూర్తి చేసేలా చూడాలని విద్యార్థులు కోరుతున్నారు.

సభ విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇచ్చోడ: జనవరి 5న ఉట్నూర్‌లో నిర్వహించే పెన్షన్ ఆక్రోష్ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పెన్షన్ కంట్రిబ్యూటరీ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సిర్పూర్ సత్యనారయణ కోరారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరించారు. ఇటీవల కేంద్ర మంత్రి వర్గం యూపీఎస్ విధానానికి ఆమోదం తెలిపిందన్నారు. ఏప్రిల్ ఒక్కటి 2025 నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు అమలు చేయనున్న ఏకీకృత పెన్షన్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం వెంకట రమణ రెడ్డి, ఉపాధ్యాయులు రవి, సురేశ్, ఉష రెడ్డి, బరపసింగ్, రామేశ్వర్, లావణ్య పాల్గొన్నారు.

టీబీపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

నార్నూర్: టీబీ వ్యాధి నివారణ కోసం ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 100 రోజుల కార్యక్రమాన్ని చేపడుతుందని హెచ్‌ఈవో రాథోడ్ రవీందర్ అన్నారు. శనివారం గాదిగూడ మండలంలోని ఝరి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో డాబా, లోకారి ఎస్సీ గూడ గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి వైద్య పరీక్షలు చేశారు. టీబీ నిర్ధారణ కోసం తెమడ పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ వ్యాధి లక్షణాలు దగ్గు, జ్వరం, ఆకలి మందగించడంతో పాటు బరువు తగ్గుతుందన్నారు. ఏదైనా ఆరోగ్య సమస్యలు ఉంటే వైద్యులను సంప్రదించాలన్నారు. ఆయన వెంట హెచ్‌ఏ ప్రకాష్, ఏఎన్‌ఎం రత్నాబాయి, అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు తీర్మానం



గ్రామసభలో పాల్గొన్న ఎంపీడీవో రమేశ్, అధికారులు

బోథ్: బోథ్ మేజర్ గ్రామ పంచాయతీలో శనివారం గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. మండల కేంద్రంలోని రజక సంఘం భవనం నుంచి అయ్యప్ప సన్నిధానం వరకు సీసీ రోడ్డుతో పాటు, డ్రెయినేజీ నిర్మాణం చేపట్టేందుకు నిర్ణయించారు. చెత్త సేకరణ కోసం హైడ్రాలిక్ ట్రాలీని కొనుగోలు, 14వ వార్డులో డ్రెయినేజీ నిర్మాణం, ఎస్సీ కాలనీలో డ్రెయినేజీ నిర్మాణం, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు వంటి పనులు చేసేందుకు తీర్మానించినట్లు పంచాయతీ కార్యదర్శి అంజయ్య తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేశ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, ఉమేష్, రాజు యాదవ్, షేక్ నాజర్, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈవో, నాయకులు

బోథ్: తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో ఎంపీడీవో రమేశ్, ఎంఈవో కుమ్మరి పోశెట్టితో పాటు ఉపాధ్యాయులు నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్యలను తీర్చేలా ఉపాధ్యాయ సంఘాలు పనిచేయాలని ఎంఈవో సూచించారు. జెడ్పీఎస్‌ఎస్(బాలుర) ప్రధానోపాధ్యాయులు మహమూద్ హస్సేన్, టీయూటీఎఫ్ మండల అధ్యక్షుడు అప్పాల శ్రీనివాస్ రెడ్డి, సతీష్ కుమార్, మోహన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, వీణ, రాజేశ్వర్, గణేష్, రమేశ్ చందర్, నవనీత్ రెడ్డి, నవీన్‌రెడ్డి, నవ్యశ్రీ పాల్గొన్నారు.

కొనసాగుతున్న హనుమాన్ చాలీసా పారాయణం



పాల్గొన్న సభ్యులు, చిన్నారులు

బోథ్: సొనాల గ్రామంలోని రాయాలయంలో హిందూ ధర్మ జాగరణ మండలి ఆధ్వర్యంలో ప్రతీ శనివారం నిర్వహిస్తున్న సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం 54వ వారానికి చేరుకుంది. మండలి సభ్యులు, చిన్నారులు శనివారం హనుమాన్ చాలీసా పారాయణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హనుమాన్ చాలీసా పారాయణం వల్ల భక్తిభావం పెంపొందుతుందని, ఏకాగ్రత, ఆధ్యాత్మిక భావాలు, ధైర్యం, తేజస్సు మొదలైన గుణాలు పెంపొందుతాయని హిందూ ధర్మ జాగరణ మండలి సభ్యులు రదాపు మధుసూదన్ తెలిపారు.

కార్యాలయాల కోసం భవనాల పరిశీలన



పరిశీలిస్తున్న తహసీల్దార్ సుభాష్ చందర్

బోథ్: నూతన మండలంగా ఏర్పడిన సొనాలలో మండల కార్యాలయాల కోసం బోథ్ తహసీల్దార్ సుభాష్ చందర్ శనివారం పలు భవనాలను పరిశీలించారు. జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఖాళీగా ఉన్న గదులను భవనాల కోసం పరిశీలించారు. గ్రామంలో మండల కార్యాలయాల భవనాలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ తెలిపారు. సొనాల మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు.

డీఆర్‌డీవోకు సన్మానం



సన్మానిస్తున్న యూత్‌కాంగ్రెస్ నాయకులు

కైలాస్‌నగర్: జిల్లా గ్రామీణ అభివృద్ధిశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన రాథోడ్ రవీందర్‌ను యువజన కాంగ్రెస్ నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. అసెంబ్లీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సామ రూపేష్ రెడ్డి ఆధ్వర్యంలో డీఆర్‌డీఏ కార్యాలయంలో కలిసి శాలువాతో సత్కరించారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, జైనథ్ మండల అధ్యక్షుడు రాకేశ్, చిల్కూరి సతీష్, కిరణ్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

నేరడిగొండ: మండలంలోని వాంకిడి గ్రామానికి చెందిన మోగిలి లక్ష్మికి మంజూరైన రూ.16,500 విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శనివారం అందజేశారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన వారు సీఎంఆర్‌ఎఫ్ పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, ప్రతాప్, మహేందర్ రెడ్డి, సోమేశ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రణాళికతో చదవాలి

బేల: ప్రతీ విద్యార్థి పట్టుదల, ప్రణాళికతో చదవాలని డీఐఈవో రవీందర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులు రాస్తున్న యూనిటెస్టు–4 పరీక్షల తీరుపై ఆరా తీశారు. విద్యార్థులు, అధ్యాపకుల హాజరు రిజిష్టర్‌లతో పాటు పలు రికార్డులను పరిశీలించారు. ప్రిన్సిపాల్ భగవాండ్లు, సూపరింటెండెంట్ మొహసిన్, సిబ్బంది ఉన్నారు.

అన్నదానం

తలమడుగు: మండలంలోని బరంపూర్ గ్రామంలో కొండపై స్వయంభుగా వెలిసిన శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం బరంపూర్ గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసి, మహా అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ముడుపు కేదారేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా ప్రతీ శనివారం అన్నదానం నిర్వహించడం జరుగుతుందన్నారు.

చింతల్‌పేట్‌ను పంచాయతీగా మార్చాలి



ఎంపీవోకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తి పంచాయతీ పరిధిలో ఉన్న చింతల్‌పేట్ గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. ఈమేరకు శనివారం గ్రామానికి వచ్చిన ఎంపీవో రత్నాకర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు నవీన్, హరి, నర్సయ్య, రవి, రాజు, నాగేష్, మధు, శేఖర్, భూమశంకర్, ప్రవీన్ తదితరులు ఉన్నారు.


విద్యార్థులకు యోగాపై శిక్షణ



యోగాపై శిక్షణ ఇస్తున్న యోగిత

బోథ్: మండలంలోని కనుగుట్ట గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో శనివారం ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా యోగా శిక్షకురాలు మునిగెల యోగిత విద్యార్థులకు యోగాపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు యోగా ప్రాముఖ్యతను వివరించారు. ప్రతీ రోజు యోగా చేయడం వల్ల కలిగే లాభాలను విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులతో యోగాసనాలు చేయించారు. యోగా నిత్యజీవితంలో భాగమైందని ప్రధానోపాధ్యాయులు జాదవ్ మహేందర్ అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్వర్, రమణ, సుభాష్ రెడ్డి, ప్రహ్లాద్, రవీందర్, అంకిత, విద్యార్థులు పాల్గొన్నారు.

చిత్రం గీసి.. అభిమానం చాటి



భారత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ ఈనెల 26న అనారోగ్యంతో మరణించిన సంగతి తెలిసిందే. కాగా.. జిల్లా కేంద్రానికి చెందిన చిత్రకారుడు ధ్యావంత్ రమేశ్ మన్మోహన్‌సింగ్‌పై తనకున్న అభిమానాన్ని చాటుకున్నాడు. నివాళిని అర్పిస్తూ మన్మోహన్‌సింగ్ చిత్రాన్ని అందగా గీశాడు. - ఆదిలాబాద్

రమేశ్ గీసిన మన్మోహన్‌సింగ్ చిత్రం →

మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న విద్యార్థులు

బోథ్: సొనాల గ్రామంలోని వివేకానం పాఠశాల విద్యార్థులు శనివారం మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు ఘనంగా నివాళులర్పించారు. మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన సేవలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ఆయన మృతి తీరని లోటన్నారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలుకు సమరశీల పోరాటం



మాట్లాడుతున్న కిరణ్

ఎదులాపురం: కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు సమరశీల పోరాటాలు చేస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. హైదరాబాదులోని చర్లపల్లిలో శనివారం నిర్వహించిన సీఐటీయూ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సమావేశానికి హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల్లో కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలన్నారు. అదేవిధంగా ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు వారికి అండగా నిలబడాలన్నారు. గత ప్రభుత్వంలో కార్మికుల సమస్యలను పట్టించుకోలేదన్నారు. కార్మికుల విషయమై ఇచ్చిన హామీల హామీలు అమలు చేసేలా ఉద్యమిస్తామన్నారు.

మర్యాద పూర్వకంగా మెలగాలి

- డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ జీవన్ రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో పోలీసులు, సిబ్బంది మర్యాద పూర్వకంగా మెలగాలని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించారు. దర్యాప్తు ఫైళ్లను తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కేసులను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెండింగ్ కేసులను త్వరగా దర్యాప్తు చేయాలన్నారు. ఆయన వెంట టూటౌన్ సీఐ కరుణాకర్ రావు, సిబ్బంది సుధాకర్ రెడ్డి, ప్రవీణ్, నరేందర్, సంజీవ్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిశీలన



సౌకర్యాలపై ఆరా తీస్తున్న అధికారులు

బేల: మండలంలోని మాంగ్రుడ్ గ్రామంలో శనివారం డబుల్ బెడ్‌రూం అసౌకర్యాలపై జిల్లా పంచాయతీ రాజ్ శాఖ ఈఈ శివరాం రాథోడ్ పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 23న జిల్లా కేంద్రంలోని ప్రజావాణిలో బాధిత డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులు కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదుపై పరిశీలించారు. విద్యుత్, నీళ్లు, సీసీరోడ్లు, తదితర సౌకర్యాల కల్పన కోసం రూ.25లక్షల మంజూరుకు ప్రతిపాదనలను కలెక్టర్‌కు నివేదించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట డీఈ కుందన్, ఏఈ హరీశ్, ఠాక్రే మంగేష్, టేకాం నేతాజీ, తదితరులు ఉన్నారు.

ఎంపీ పరామర్శ

నేరడిగొండ: నేరడిగొండ మాజీ సర్పంచ్ ఏలేటి రాజేశ్వర్ రెడ్డి మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ శనివారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం తేజాపూర్ గ్రామానికి చెందిన కార్తీక్‌రెడ్డి ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు గాదె శంకర్, రాజు, రాజేశ్వర్, శ్రీధర్, తదితరులు ఉన్నారు.

నేరడిగొండ: మండలంలోని లింగట్ల గ్రామానికి చెందిన సాబ్లే దేవ్‌సింగ్ మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ శనివారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మండల నాయకులు బద్దం పోతారెడ్డి, హీరాసింగ్, ఆడే జనార్దన్, రాథోడ్ సుభాష్, నగేశ్ ఉన్నారు.

తాంసి: మండలంలోని పలు బాధిత కుటుంబాలను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శనివారం పరామర్శించారు. పొన్నారి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి రమణ కుమారుడి ఆరోగ్య పరిస్థితి బాలేకపోవడంతో బాలుడికి పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాంసి, గిరిగాం, జామిడి గ్రామాల్లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పలు బాధిత కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.